# ఎదురుబొదుగూ లేదు నారాయణా...

నీకూ నాకూ ఓ పేరున్నది. ఓ అడ్రసున్నది. మనల్నెవరయినా కలుసుకోవాలంటే ఫలనా టైముకు ఫలానా చోటుకువచ్చే మనల్ని కలుసుకోవచ్చు.

కానీ నూకరాజు సంగతి అలాకాదు, అసలతని పేరు 'నూకరాజు' కూడా కాదు. "నా అసలు పేరేమిటని అడక్కండి. చిన్నప్పుడు నన్ను 'అబ్బిగా' అనేవాళ్లు ఇప్పటికీ మా 'విజీనగరం' వెడితే అక్కడోళ్ళు 'అబ్బిగా' అనే అంటారు".

చేతి సిరా మరకల్ని, పాత గుడ్డకు తుడుచుకుంటూ చెప్పుకొచ్చాడు నూకరాజు. విజయనగరం మొత్తంమీద సత్తిరాజును మించిన టైలర్ లేడనడం అతిశయోక్తి అవుతుందేమో గానీ బాగా కుట్టే టైలర్లలో అతనూ వొకడంటే ఎవరికే అభ్యంతరమూ వుండదు. ఆ పనివాడితనంలో అతను సుఖంగా బతకవచ్చు. ఆపాటి పని చేతగానివాళ్లు కూడా అతనికన్నా మిన్నగా బతుకుతున్నారు.

అయితే సత్తిరాజుకున్న సదభ్యాసాలు ఇన్నీ అన్నీ కావు. రాత్రి ఎనిమిది, తొమ్మిది గంటల దాకా పనిచేసి, వొస్తూ వొస్తూ మందుపుచ్చుకొని ఏ అర్ధరాత్రికో అపరాత్రికో కొంపకు చేరుకునేవాడు. తింటే రెండు మెతుకులు తినేవాడు. లేకపోతే, పెళ్ళాంతో దెబ్బలాటపెట్టుకునేవాడు. అదీ ఇదీ కాకపోతే ముసుగెట్టుకుని పడుకునేవాడు.

తిండి తిన్న రోజున వోయగ్గెం చేసినంత హడావుడి జరిగేది. అన్నంలోకి చేపా జెల్లా లేనందుకు సత్తిరాజు తారామండలానికి లేచి పోయేవాడు. ఆ కోపంతో ఏది దొరికితే దాన్ని పుచ్చుకొని, భార్యమీదకి విసిరేసేవాడు. పడేసి జుట్టు పట్టుకొని చితకతన్నేవాడు.

"నా చిన్నప్పుడు దాదాపు ప్రతి రోజు ఈ కొలువు ఉండేది, నాకు లీలగా గుర్తున్నది. ఓ రోజు మా నాన్న చుట్టతో మా అమ్మ చేతుల్ని జబ్బల్ని కాల్చాడు. నేను భయంవేసి అరిచాను. నన్ను రెండు చరుపులు చరిచి, రోడ్డుమీదకి తోశాడు" అన్నాడు నూకరాజు.

సత్తిరాజు ఖర్చులకూ, ఆదాయానికి పొంతన లేదు. వచ్చే రాబడి 'మందు' కోసం ఖర్చయిపోతే, మిగిలిన ఖర్చులకు 'పైసా' వుండేది కాదు. అందుకని సులువుగా డబ్బు సంపాదించే పద్ధతుల్ని వెదకసాగాడు. అతనికెవరు చెప్పారో, ఎప్పుడు చెప్పారో తెలియదుగానీ బ్రాకెట్ ఆటను మప్పారు. ఒకప్పుడు 'అణా'- 'బేడా' ఆడేవాడు కాస్తా రాను రాను రూపాయీ, రెండూ ఆడడం మొదలెట్టాడు. అంతకు ముందు 'మందు'కు పోగా మిగిలిన చిల్లరన్నా ఇంటికొచ్చేది. ఇప్పుడదీ లేదు.

"చాలా మందికి నాన్నను చూస్తే ప్రేమ, అభిమానం పుట్టుకొస్తుంది. నాన్నను చూడగానే పరుగెత్తుకుంటూ వెళ్ళి, కావలించుకునే వాళ్ళున్నారు. అలా వచ్చిన పిల్లల్ని ఎత్తుకొని ఆప్యాయంగా ముద్దులాడే నాన్నలు వున్నారు. నా కర్మ కాకపోతే నాకీ ముచ్చట్లలో వొక్కటీ తీరలేదు. నాకు మా నాన్నను చూస్తే చచ్చేంత భయం. ఆయన కొట్టడం కోసమే ఇంటి కొస్తున్నాడనిపించేది. ఆయన అంత దూరంలో వుండగానే పారిపోయేవాణ్ని" అన్నాడు నూకరాజు.

ఒకసారయితే, ఎవరన్నా ఆదుకుంటారుగానండీ, రోజూ చచ్చేవాడికోసం ఎవరేడుస్తారండీ? అప్పుడప్పుడు నాన్నను పోలీసులు పట్టుకెళ్లడం, రెండేసి మూడేసి రోజులకు విడిచిపెట్టడం

మామూలయిపోయింది. నేను భగవంతుడి సాక్షిగా చెబుతున్నాను బాబూ! నేను చెప్పింది అబద్ధమయితే నాకీ అన్నం కూడా దొరక్కుండా పోవాలి. బజారుకెళ్ళాలంటే నాకు చిన్నతనంగా ఉండేదండీ! నా ఈడు వాళ్ళంతా నన్ను ఎద్దేవ చేస్తుండేవాళ్ళు. 'దొంగసత్తిగాడి కొడుకు' అనేవాళ్ళు 'జాగ్రత్తగా ఉండాల్రోయ్' అనేవాళ్ళు ఆడుకునేటప్పుడు ఏదిపోయినా, నేనే తీశాననేవాళ్ళు, మా నాన్న కారణంగా నేను 'దొంగ'నని పేరుపడ్డాను'' అన్నాడు నూకరాజు ముఖం చిన్నబుచ్చుకుంటూ.

అదేదో పెద్ద దొంగతనం కేసులో సత్తిరాజును కూడా యిరికించారు పోలీసులు. ఆరేడు మాసాల పాటు విచారణ జరిగింది. సత్తిరాజుకు రెండు సంవత్సరాలు జైలు శిక్ష వేసి రాజమండ్రి పంపించారు.

''నేనూ అమ్మ కూడా రాజమండ్రి వచ్చామండీ!'' అన్నాడు నూకరాజు. అప్పటికి అతనికి తొమ్మిదేళ్ళన్నా నిండలేదు. రాజమండ్రిలో కోటగుమ్మం దగ్గర వో హోటల్లో పనిక్కుదిరింది అమ్మ. నూకరాజు అస్తమానూ, అమ్మనే అంటి పెట్టుకుని ఉండేవాడు. అప్పుడప్పుడు అమ్మకు పనిలో సాయం చేస్తూ వుండేవాడు. ఆ హోటల్లోనే తిని, అక్కడే నిద్రపోయేవాడు.

''బల్లలు తుడవడం, గ్లాసులు, పళ్లాలు ఎత్తడం, అవి పంపుదగ్గర పడేయడం, కడిగిన వాటిని అరుగుమీద పేర్చడం, మధ్యాహ్నం పూట తడిగుడ్డతో బల్లల్నీ, కుర్చీల్నీ శుభ్రం చేయటం ఇవన్నీ చేశానండీ!'' నూకరాజు బతుకు అయిదు సంవత్సరాలపాటు హోటల్ గోడల్ని దాటి ఇవతలకు రాలేదు.

నిజానికి - శిక్ష పూర్తికాగానే సత్తారాజు వచ్చి వుండవల్సింది, కానీ రాలేదు. రానందుకు అమ్మగానీ, నూకరాజుగానీ విచారించలేదు. 'వస్తాడేమో'నన్న భయం మాత్రం నూకరాజుకున్నది.

''నాకసలీ పనిమీద ఇష్టంలేదండి! ఎందుకొచ్చిపడ్డానో ఈ లైన్లో పడ్డాను. ఇదెవరి దగ్గరా నేర్చుకోలేదు. నా అంతట నేను నేర్చుకున్నాను. నాకు ఇప్పుడు ఇరవై నాలుగేళ్ళు. నాలుగేళ్ల నుంచి ఈ పనిచేస్తున్నా అప్పటి దాకా అమ్మ పనిచేస్తూనే ఉండేది...అదే హోటల్ కాదనుకోండి. కొంతకాలం సొంతంగా కూరగాయల దుకాణం పెట్టింది. ఇంకొంతకాలం కూరల తట్ట మోసుకుంటూ వెళ్ళి ఇల్లిల్లూ తిరిగింది. దుకాణం పెట్టినప్పుడు పోలీసుల న్యూసెన్సు చాలా ఉండేది. అదిరించి, బెదిరించి, ఉన్న కూరలన్నీ గుంజేసుకునేవాళ్ళు'' అన్నాడు నూకరాజు.

''ఆదాయమా?'' అని నవ్వేశాడు నూకరాజు. రోజుకు ఆరేడు రూపాయలకు ఢోకా ఉండదు. పెన్నుల రిపేరు పనంతా నాకు తెలుసునండీ! మారుబేరానికి కలాల్ని, కళ్ళజోళ్ళనూ అమ్ముతుంటా. ఒక్కో కలం మీదా 40, 50 పైసలుంటుంది. ఇక చలవజోళ్ళ సంగతి, మాకు నాలుగు డబ్బులు మిగిలేది ఇందులోనేనండి! మనిషి వాలకాన్ని బట్టి బేరం చెబుతూ... వీలయినంత ఎక్కువ గుంజుకోవాలనే చూస్తానండి! కష్టమర్ని మాత్రం పోనివ్వను.''

నూకరాజు తన ఆదాయం విషయంలో నిజం చెప్పలేదనిపించింది. ఆ మాటే అన్నప్పుడు అతను చిరాకు పడ్డాడు.

''ఇన్ని సంగతులు నిజం చెప్పినోణ్ని ఈ సంగతి అబద్ధమెందుకు చెబుతానండీ? నాలుగు పెట్టెల సరుకు చూసి, మీరు లాభాలు అంచనా వేసి ఉంటారు. ఓసారి కలం కొంటే, కనీసం

రెండేళ్లదాకా పనిచేస్తుంది గదా! చిన్న చిన్న రిపేర్లు వస్తే, పావలా, అర్థా కూడారాదు. ఎన్ని పావలాలు పోగేస్తే పది రూపాయలవుతాయో మీరే చెప్పండి!'' అన్నాడు నూకరాజు.

''మీకంటే వో ఇల్లుంది కనుక, స్థిరంగా ఉంటారు. నాకు బాధ లేదండీ! ఈ ఊళ్ళన్నీ నావే! ఈ రాజ్యమంతా నాదే!'' అన్నాడు నూకరాజు హాయిగా నవ్వుతూ.

అతనికి సినిమాలు చూడడమంటే చాలా ఇష్టం. క్రైం, సెక్సు, డాన్సులు ఉన్న సినిమాలు రెండేసి మూడేసి సార్లు కూడా చూస్తానన్నాడు. ''జయమాలిని గాని, హలం గాని సినిమాలో వుంటే నేను తప్పకుండా చూస్తాను సార్'' అన్నాడు నూకరాజు వాళ్ళ ఫోటోలను పర్సులోంచి తీసి చూపిస్తూ.

నూకరాజుకింకా పెళ్ళికాలేదు. ఇప్పట్లో పెళ్ళి చేసుకోవాలని కూడా తనకు లేదన్నాడు. తన అమ్మ కులాసాగానే వున్నదని, ఇప్పటికీ ఆ పనీ ఈ పనీ చేస్తానని గునుస్తూ ఉంటుందనీ, తనే కోప్పడి ఊరుకోబెడుతూ వుంటానని నూకరాజు అన్నాడు. తన దగ్గర నిలవ లేదన్నాడు.

''నాకా అలవాటు లేదండీ! నేను తాగను. ఇంతవరకూ సరదా కోసం కూడా నేను చుక్క ముట్టుకోలేదు.'' అన్నాడు నూకరాజు.

చిత్రమేమిటంటే- అతనలా అంటున్నప్పుడు గుప్పుమని మందు వాసన కొట్టడం!